# పీచుమిఠాయి వేటలో...

నూలుచీర కట్టడమా, పట్టుచీర ధరించడమా—వాయిల్ చీర చుట్టబెట్టుకోడమా. సిల్కుచీర సింగారించడమా, స్లిప్పర్లు వేసుకోవడమా. బెల్టు షూ బిగించడమ, బన్ పెట్టి జుత్తు గోపురంలా వేసుకోడమా, చిన్న ముడి వేసుకొంటే చాలా, వెనక 'వి' షేపు జాకెటు తొడగడమా, సంసార పక్షంగా లోనెక్ కాకుండా పట్టు రవిక వేసుకోవడమా-ఇలా యిలా నిత్య సందేహాలు లక్షరకాలివి క్వశ్చన్ మార్కుల్లా వచ్చి నిలుస్తాయి నాకు. నాకనేమిటి? ప్రతిభామిని డ్రెస్సప్పవటంలో, అలంకరించుకోవటంలో 'ఎలా వుంటే బాగుంటాను' అని సతమతం కావటం అన్నాచురల్ అని కొట్టి పారేయటం తగదు. ఆడవారి బాధలు ఆడవారివి. వీటినే అలంకరణ కోసం అద్దం ముందు కుస్తీపట్లు అని అన్నా వచ్చు. కుస్తీ ఎవరితో-మనసుతో—మనసు వెర్రిబాగులది-అది గుర్రం-మనసు గుర్రమురోరి మనిషి అన్నారు కవిగారు. గుర్రానికి సమస్యలుండవనుకోండి దవుడు తీయడం తప్ప.

మనం సుఖంగా జీవించాలంటే కోరికల్ని పెంచుకోవడం తప్పంటారు వేదాంతులు. ఇవి చిన్న కోరికలే కదా — యివీ లేకపోతే జీవితం డల్‌గా మరియు మరోజుగా వుంటుందని వాపోతారు లలనామణులు. కాని మనం ఎంతవరకు మనకోసం జీవిస్తున్నాం. ఎంతవరకు యితరుల కోసం

జీవిస్తున్నాం అనే ప్రశ్నకు ఎప్పుడో ఒకప్పుడు ఎక్కడో ఒకచోట జవాబు చెప్పుకోవాల్సుంటుంది. మనం మనకోసమే జీవిస్తున్నాం కాని ఇతరుల కోసం కాదు అనేది పరమసత్యం. దాన్ని చాలా మంది ఆడవాళ్ళు ఒప్పుకొనజాలరు, అందువల్లనే లక్షతొంభై పేచీలు, సణుగుళ్లూ, చికాకులు వస్తాయి సం-సారాల్లో. ఉన్నదానిలో ఉన్నంత శుభ్రంగా నీటుగా వుండాలి.



అయితే ఎంత? దానికి అమ్మాయిగారు జవాబు చెప్పలేరు. ఆ ఎంతే యింతింతై కొంపముంచవచ్చు. వీటిని ఆంగ్లంలో లిమిటేషన్సు అంటారు. వీటిని తెలుసుకోవడం ఒక పీచుమిఠాయి వేటలాటిది.

ఎవరేమనుకుంటారో అన్జెప్పి అప్పటికప్పుడు బజారికి పంపి అప్పుజేసి పప్పుకూడు తినిపించే అమ్మాజమ్మలున్నారు మనలో. నూలుచీర కట్టుకుంటే ఏవనుకుంటారు? పట్టుచీర కట్టుకుంటే ఏవనుకుంటారు? రిక్షామీద వెళితే తలతీసేస్తారా? టాక్సీలో వెళ్తే ఎదురుగుండా వచ్చి మంగళహారతి పడతారా? నడిచివెళ్తే ఫడాల్మని లెంపకాయ కొడ్తారా? ఇవన్నీ అనుకోడాలు-మిడిల్ క్లాసు జీవితం

ఈ అనుకోడాల అనుమానపు సుడిగుండంలో పడిపోయి దివాలా తీస్తోంది· స్టేటసు అని పైకనసుగాని చాలా మంది స్త్రీలు మన అలతస్థుకు తగినట్లు వున్నదానిలో ఉన్నంత—అని సన్నాయి నొక్కులు నొక్కుతారు. సోషల్ లైఫ్‌కి ఆడవాళ్ళ అభిరుచులే ప్రాణం. అయితే మనకి ఆడవాళ్ళ ప్రపంచం వేరు. మగవాళ్ళ ప్రపంచం వేరు అయినందున ప్రతి మనిషీ ఇంట్లో విఘ్నేశ్వరుడైన పరమేశ్వరుడు.ఇంట్లో సనాతనుడు ట్రెడిషనలిస్టు మరియు గాడ్‌ఫియరింగు నేచరు బయట డిమోక్రటు, రాడికల్ లేదా ఉగ్రవాది. మన జీవితంలో ఈ కాంట్రడిక్షన్స్ చాలా అంపమైనవి. అంచాత మగాళ్ళు ఒకప్పుడు మొదవుకగనున్న వృషభాల్లా మరొకప్పుడు స్వేచ్ఛాప్రియుళ్ళా, డామ్‌కేర్ మాస్టర్లలా వుండడం కద్దు.

అయ్యో మన జీవితాల్లో డబల్‌స్టాండర్డ్స్ అన్నిటా వున్నాయి. సొసైటీ నిండా వున్నాయి. ప్రతి ఆడదానికీ మగాడికి కనీసం మినిమం రెండు ముఖాలన్నా వున్నాయి. ఒకటి లోపలా ఒకటి బయటా - ఓపెన్ లైఫ్ ఎవరికీ లేదు.

మీరు కనిపెట్టారో లేదో—ఈ రెండు ముఖాల చాటు మాటుత నాన్ని పిల్లలు సహించరు. వాళ్ళకిందులోని దుర్మార్గపూ తెలీదు. అంచేత వాళ్ళు రపీమని కట్‌చేసి పెద్దవాళ్ళ నిజరూపాల్ని బహిర్గతం చేస్తూ వుంటారు.

మచ్చుకి నేనోమారు మా తోటికోడలు చీర కట్టుగున్నాను పేరంటానికి. దాని కొడుకు వచ్చి పేరంటలో నా ఒళ్ళో కూర్చుని "మా అమ్మ చీర ఎందుకు కట్టుకున్నావ్, విప్పేమని ఏడుపు మొదలెట్టాడు. నిజంగా ఏడవాల్సింది నేను. అల్లాగే—మొన్నోసారి మావార్ని లోపలకొచ్చి కాఫీ తాగండన్నాను. చెంబులోపోసి మూతపెట్టిన కాఫీ ఒక్కరికే సరిపోతుంది. వీధిలో చాలామంది వున్నారు. పాలులేవు· ఇవ్వాలన్నా యిబ్బందే—ఆయన లోపలికొస్తే కాఫీగ్లాసు అందిచ్చాను. "వేడి సరిపోతుందా"అంటూ. ముఖం అయిష్టంగానే పెట్టి కాఫీమీద భ్రమవలన తాగుతున్నారు. పెదిమలు చప్ప రిస్తూ, మూతి సరిచేసుకొంటూ వెళ్ళకండి బావుండదు అన్నాను.ఇంట్లోకెళ్లి కాఫీ తాగొచ్చాడని ఆయన గురించి ఎవరైనా అనుకున్నా క్యారెక్టర్ అసా

సినేషన్ కదా—ఇంతలో ఎవరో మీ నాన్నగార్ని పిలు అమ్మా అని మా చంటిదాన్ని అడిగారు. లోపల కాఫీ తాగుతున్నారు — ఇప్పుడే వచ్చేస్తారు కూర్చోండి-అంది మా కుర్రది. దానన్ని దాని వీపుబద్దలు కొడదామన్నంత కోపం వచ్చింది. ఖాన్‌దాన్‌కా ఇజ్జత్ అంతా మా అమ్మాయి మంటగలిపేసింది. మరొకసారి మావారు కొత్తాకొట్లో రెండు సిగరేట్టు పెట్టెలు పట్రమన్నారు మా నాలుగో వెధవని, డబుల్లేనప్పుడు అరువుమీద రెండు మూడు పెట్టెలు కాల్చేస్తారు మావారు. ఉత్తప్పుడు పెట్టిమీద పెట్టె కొని కాలుస్తారు. ఇంతలో మావారి ఫాన్‌గారొకయన వచ్చి తిష్టవేశాడు ముందు గదిలో—అప్పుడు మా వెధవ వచ్చి "సిగరెట్లు అరువివ్వనంటున్నాడు నాన్నారూ" అన్నాడు. అప్పుడు మావారు చిరునవ్వు నవ్వి "నేన్చెప్పానని చెప్పు అన్నారు. "మీరు చెప్పినా యివ్వడ్ట" అని మళ్ళీ వచ్చి చెప్పాడు. అప్పుడు నేను కలగచేసుకుని "పది రూపాయల నోటు మార్చిపట్టుకురారా" అన్నాను."పొద్దున్నే పదిరూపాయల నోటు చిల్ల రెక్కడ దొరుకుతుందే" అన్నారు మావారు. అప్పుడు మావారికోసం వచ్చిన ఫానుగారు నా దగ్గరున్నాయి లెండి నేనిస్తాను అని రెండు అయిదు రూపాయల నోట్లు పైకి తీశాడు. అసలు పది రూపాయల నోటు లేమగదా ఖర్మ. అప్పుడు మావారు కంగారుపడకుండా—వాడే యిస్తాడులెండి కొట్టువాడు. బోణీకాలేదేమో యింకా - పదిరూపాయల నోటుకి చిల్ల రివ్వకుండా సిగరెట్లుయిస్తే అరువు బేరంతో ప్రారంభమవుతుందని భయపడుతున్నారు వుషారుకారు (షావుకారు) అని విపులీకరించారు-"మీకెందుకండీ శ్రమ" అంటూ. అన్నా కొద్దీ ఆయన లేచిపోతున్నాడు. 'వుండండి గురువుగారూ నేను తెస్తాను అంటూ, అలా ఆ రోజు మహా మెస్సయిపోయింది వ్యవహారం. దీన్నే పీచుమిఠాయి వేట........అంటారు తెలుగులో. రమారమణ గోవిందో హరి—

●